క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఇబ్రహీంపట్నం: స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కంచికచర్ల ఫైర్ సేఫ్టీ అధికారి శివారెడ్డి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి అనే అంశంపై విద్యార్థులకు మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణ ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో సమయ స్ఫూర్తి ముఖ్యమన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని చెప్పారు. దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ కృష్ణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు నిధులు జమ



జి.కొండూరు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద మొటి విడతగా మైలవరం నియోజకవర్గంలోని రైతులకు రూ.20.19 కోట్లు జమ కానున్నాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మండల పరిధి కవులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చలో విజయవాడ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్రంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 7న నిర్వహించనున్న చలో విద్యుత్ సౌధ కార్యక్రమ వాల్‌పోస్టర్లను కొండపల్లి సబ్ స్టేషన్‌లో అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు విజయరావు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. కిశోర్ తదితరులు పాల్గొన్నారు

రేషన్ బియ్యం పట్టివేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో అక్రమంగా రెండు ట్రక్కు ఆటోల్లో తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. కొండపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావుకు అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న రెండు ట్రక్కు ఆటోలు కంటపడ్డాయి. వాహనాలు ఆపి రికార్డులు తనిఖీ చేయగా బియ్యానికి సంబంధించిన రికార్డులను వారు చూపకపోవడంతో రెండు ట్రక్కు ఆటోలను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం బస్తాలతోనే కొన్నింటిని నేరుగా తరలించడం గమనార్హం. వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

రైతు బజారులో ఆర్వో ప్లాంటు ప్రారంభం

తిరువూరు: స్థానిక చీరాల సెంటర్‌లోని రైతు బజారు ఆవరణలో మంచినీటి సమస్య పరిష్కారానికి మార్కెటింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటును ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. రైతు బజారులో డ్వాక్రా మహిళలకు కేటాయించిన 11 స్టాల్స్‌కు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కూరగాయలు విక్రయించాలని, నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే దుకాణదారులకు సూచించారు. తిరువూరు ఏఎంసీ చైర్మన్ రేగళ్ల అనిత తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు వెనకడుగు



బేస్‌మెంట్ దశలోనే నిర్మాణం ఆగిపోయిన జి.కొండూరు సచివాలయం-1 భవనం



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన గంగినేని గ్రామ సచివాలయ భవనం



నిర్మాణం చివరి దశలో ఆగిపోయి పాడుబడిన వెల్లటూరు సచివాలయ భవనం-1

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు
- సచివాలయ భవనాల నిర్మాణాలను మధ్యలోనే ఆపివేసిన వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన అసంపూర్తి భవనాలు

జి.కొండూరు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రభుత్వ పాలనను గడప వద్దకే చేర్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వ ఆనవాళ్లేవి ఉండడానికి వీల్లేదన్నట్లు ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వానికి దేశ వ్యాప్తంగా పేరు తెచ్చిపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కూటమి పాలకులు అడుగులు వేస్తున్నారు. ఒక్కసారిగా వ్యవస్థను తొలగిస్తే వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందని సేవలను ఒక్కొక్కటి ఆపుతూ భవన నిర్మాణాలను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. వివిధ దశల్లో ఉన్న సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేయకుండా ఏడాది కాలంగా ప్రభుత్వం గాలికొదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయి.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు	వాడుకలో ఉన్న భవనాలు	నిర్మాణాలు ఆగిన భవనాలు
జి.కొండూరు	16	12	04
మైలవరం	17	09	08
రెడ్డిగూడెం	12	11	01
ఇబ్రహీంపట్నం	11	05	06
కొండపల్లి(మున్సిపాలిటీ)	10	09	01

వివిధ దశల్లో 20 భవనాలు

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో 66 గ్రామ సచివాలయాలు ఉండగా 46 గ్రామ సచివాలయాలకు గత ప్రభుత్వంలోనే భవనాల నిర్మాణాలు పూర్తయి సేవలు కొనసాగుతున్నాయి. మిగిలిన 20 భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

10 శాతం పనులు చేస్తే వాడుకలోకి..

కొన్ని భవనాలైతే పది శాతం పనులు చేస్తే వాడుకలోకి తీసుకురావచ్చు. అటువంటి భవనాలను కూడా ఏడాది కాలంగా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయి. రూ.40 లక్షలతో ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణాన్ని చేపట్టిన గత ప్రభుత్వం 80 శాతం భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే ఈ ప్రభుత్వం 20 శాతం భవనాలను పూర్తి చేయలేక వదిలివేసింది. దీనితో నిర్మాణ దశలో ఉన్న భవనాలపై వెచ్చించిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. భవనాలు లేక ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే సేవలు కొనసాగిస్తున్నారు.

సేవలు అంతంతమాత్రమే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి 500లకు పైగా సేవలను ప్రజలకు అందించింది. సచివాలయాలకు అనుసంధానంగా గ్రామ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల వివరాలను సేకరించి ప్రతి సంక్షేమ పథకాన్ని గడప వద్దకే అందేలా చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి ధ్రువీకరణ పత్రాన్ని కూడా జగనన్న సురక్ష పేరుతో నేరుగా ఇంటి వద్దకే అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు వ్యవస్థను నిలిపివేయడంతో పింఛన్ లబ్ధిదారులు నరకయాతన పడుతున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం, రెవెన్యూ సమస్యలు, ఇతర ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

భవన నిర్మాణాలు పూర్తిచేయకపోవడం దుర్మార్గం



గత ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందించింది. ఈ ప్రభుత్వం కనీసం నిర్మాణాలు మధ్యలో ఆగిన భవనాలను కూడా పూర్తి చేయకపోవడం దుర్మార్గం. గంగినేనిలో సచివాలయ భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే సేవలు అందిస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– పిల్లి రామారావు, సర్పంచ్, గంగినేని గ్రామం

సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలి



వెల్లటూరు గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం ప్రభుత్వం మారగానే ఆగిపోయింది. కొద్ది పాటి పనులు పూర్తి చేస్తే వాడుకలోకి తీసుకురావచ్చు. ఏడాది కాలంగా అలానే వదిలేయడంతో పాడుబడిన భవనంలా మారిపోయింది. సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేసి సేవలను యథాతథంగా కొనసాగించాలి.

మందా నోవా, గ్రామస్తుడు, వెల్లటూరు

కూటమి మోసాలను ప్రజలకు వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, కూటమి మోసాలను ప్రజలకు వివరించాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ దేశంలోనే మోసాలు, దగా, కుట్రలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని, ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా ఒక్క హామీ నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మళ్లీ దగా చేశారని విమర్శించారు. మూడు పార్టీల కూటమి కనీసం పార్టీకి ఒక్కటి చొప్పున ఒక్క పథకమైనా సొంతంగా ప్రవేశ పెట్టిందా అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో ఏ సొంత పథకాన్ని కూడా అమలు చేయలేక కూటమి ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాల పేర్లు మార్చి అరకొరగా అమలు చేయడమేనా 40 ఏళ్ల సీనియర్, విజనరీ వ్యక్తి చేసే అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. నూజివీడు అభివృద్ధి ఎక్కడ జరుగుతుందని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయాలనుకుంటే మీరే మోసపోతారన్నారు. కేంద్రియ విద్యాలయ తరగతులు ప్రారంభించేందు కనీస ప్రయత్నం కూడా చేయకపోగా దాన్ని అడ్డుకునేందుకు ఆ భవనాల్లో ఆఫీసులు తెరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులతో వైఎస్సార్ సీపీని అడ్డుకోలేరని, ఉవ్వెత్తున లేచే కెరటాల్లా కార్యకర్తలు పనిచేసి మళ్లీ ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, రాపర్ల సుబ్బారావు, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, సర్పంచ్‌లు ఎన్.సత్యనారాయణ, పి.సత్యనారాయణ, ఎంపీటీసీలు, గ్రామ పార్టీల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, సొసైటీల మాజీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సు సర్వీసులు

విజయవాడ ఆర్టీసీ ఈడీ విజయానంద్



ఇంద్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఈడీ

తిరువూరు: ఆర్టీసీ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సు సర్వీసులు నడుపుతోందని విజయవాడ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయానంద్ అన్నారు. తిరువూరు డిపోకు కేటాయించిన ఇంద్ర ఏసీ బస్సులను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. విజయానంద్ మాట్లాడుతూ తిరువూరు డిపో నుంచి దూరప్రాంత సర్వీసులు ప్రారంభించాలని పలు విజ్ఞప్తులు వస్తున్నాయని, ఆక్యుపెన్సీ రేషియో ప్రామాణికంగా ఈ సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజయవాడ రీజినల్ మేనేజరు ఎంవై దానం తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

మైలవరం: మైలవరంలో కోతుల దాడిలో శనివారం ఓ మహిళ గాయపడింది. స్థానిక శివాజీ వీధికి చెందిన సామ్రాజ్యం శనివారం ఇంటి పెరట్లో ఉన్న సమయంలో కోతులు వచ్చి ఆమెపై దాడి చేశాయి. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వాటిని తరిమివేశారు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోతుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మామిడి తోటల్లో తేనెమంచు పురుగు ఉధృతి

నూజివీడు: నూజివీడు ప్రాంతంలోని మామిడి తోటలు ప్రస్తుతం కొత్త చిగురు వచ్చే దశలో ఉన్నాయని, అయితే తోటల్లో తేనెమంచు పురుగు ఉధృతి కూడా ఎక్కువగా ఉందని మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి అన్నారు. తోటల్లో జింకు, బోరాన్ ధాతు లోపాలు అధికంగా ఉన్నట్లు గమనించామన్నారు. తోటల్లో ఉధృతంగా ఉన్న తేనె మంచు పురుగు నివారణకు రైతులు కలుపు లేకుండా తోటలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తోటల్లో గుబురుగా అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించుకోవాలని, తద్వారా చెట్టుకు గాలి, వెలుతురు వస్తుందన్నారు. మామిడి తోటల్లో నీళ్ల నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేప గింజల కషాయం 5 శాతం లేదా అజాడిరక్టిన్ 3000 పీపీఎం 2 ఎంఎల్ లేదా క్లోరీఫైరిఫాస్ 2.5 ఎంఎల్, మోనోక్రోటోఫాస్ 36 ఎస్ఎల్ 1.6 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లీటరు నీటికి కలిపి ఆకులు, చెట్టు కొమ్మలు, కాండం బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వీటితో పాటు జింకు ధాతు లోప నివారణకు జింకు సల్ఫేట్ 5 గ్రాములు, బోరాన్ ధాతు లోప నివారణకు బోరాన్ 2 గ్రాములు, కొత్త చిగుళ్లను ఆశించే తెగుళ్ల నివారణకు మాంకోజెబ్, సాఫ్ శిలీంధ్ర నాశిని 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పచికారీ చేసుకోవడం ద్వారా అరికట్టవచ్చన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన హెచ్ఎం విజయకుమారి

నూజివీడు: అన్నవరం జెడ్పీ హైస్కూల్‌లో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శనివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి హెచ్ఎం జి. విజయకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు పాటుపడిన మహనీయుల జీవిత చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



లక్ష్మీపురం(తిరువూరురూరల్): పర్యావరణ పరిరక్షణకు, నాణ్యమైన దిగుబడులకు రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రంగారావు పేర్కొన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై అవగాహన ప్రదర్శన శనివారం నిర్వహించారు. రైతులు రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం, జీవామృతం, ఘనామృతం, పచ్చిరొట్ట ఎరువులను వాడాలని ఏడీఏ సూచించారు. వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషకాలు పుష్కలం

సీడీపీఓ భానుమతి

రాయనపాడు(విజయవాడరూరల్): తల్లిపాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, వీటిని పిల్లలకు ఇవ్వడం ద్వారా పోషకాలు అంది ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ భానుమతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు రాయనపాడు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంటి బిడ్డలకు తల్లిపాలను మాత్రమే తాగించాలన్నారు. ఆరు నెలలు నిండిన తరువాత అనుబంధ పోషకాహారం అలవాటు చేయడం, సున్నా నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి, గర్భిణులు బాలింతలు, సంవత్సరం లోపు పిల్లలు పౌష్టికాహారం తీసుకోవలసిన అవసరాన్ని తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, టాటా ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.


చోరీకి పాల్పడిన టీడీపీ నాయకుడి కుమారుడు!

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

ఇబ్రహీంపట్నం: కొండపల్లి శాంతినగర్‌కు చెందిన టీడీపీ నాయకుడి కుమారుడు ఓ చోరీ కేసులో నిందితుడిగా మారాడు. గత జూలై 30వ తేదీన తన స్నేహితుడితో కలిసి ఓ ఇంట్లో చోరీ చేసిన విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చోరీ చేసి బయటకు వస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇప్పటికే అతను మూడు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండటంతో సంబంధిత బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. టీడీపీ నాయకుడి కుమారుడు కావడంతో పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. సీసీ ఫుటేజీ వీడియోలు లభించినప్పటికీ కేసు నమోదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'మధ్యాహ్న భోజన' కార్మికుల తొలగింపు అన్యాయం

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కార్మికులు



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో గత 18 ఏళ్లుగా పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులను అన్యాయంగా తొలగించడంపై ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చాట్ల పుల్లారావు మాట్లాడుతూ భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నా ఎస్ఎంసీ కమిటీ పేరుతో ఏజెన్సీని అన్యాయంగా తొలగించారన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా పని చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకురాలు లటికే పద్మతో పాటు కార్మికులను తొలగించడం అప్రజాస్వామికమన్నారు. ఎస్ఎంసీ సభ్యులు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై పెత్తనం చేయడంపై మండిపడ్డారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న వీరి పొట్టకొట్టడం అధికార పార్టీకి తగదన్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మనే మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వహిస్తున్నారన్నారు. చైర్మనే నిర్వహించేటప్పుడు ఎలా వండినా హెచ్ఎం కూడా ఏమీ చేయలేని పరిస్థితి పాఠశాలలో నెలకొందన్నారు. రాష్ట్రంలో కూడా ఎస్ఎంసీల పేరుతో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తున్నారని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న పాలకులకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శోభారాణి, ఎల్. పద్మావతి, యు. కుమారి, రజని, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు శనివారం మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన దేవరపల్లి నారపరెడ్డి, విజయకుమారి రూ.18,500 విరాళంగా ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

బాలికల్లో మానసిక వికాసం పెంపొందాలి



ఇబ్రహీంపట్నం: బాలికల్లో మానసిక వికాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల శిక్షణా కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మాధవి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బాలికా వికాసంపై జరిగిన వివిధ ప్రాంతాల కమ్యూనిటీ హెల్త్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. వారి పెరుగుదలలో గమనించాల్సిన అంశాలు, ప్రాథమిక దశలో మానసిక వైకల్యం గుర్తించడం, మానసిక వికాసానికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ పుష్పలత, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సయ్యద్ ఫర్హీన్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సారథికి పీహెచ్‌డీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని ఏబీఎంపేట ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు త్వంగారపు సారథికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ శనివారం ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జేఆర్ ప్రియదర్శిని పర్యవేక్షణలో సెకండరీ గ్రేడ్ విద్యార్థుల విద్యా ప్రగతి, కుటుంబ విషయాలపై తన పరిశోధనా గ్రంథం 'ఫ్యామిలీ ఎన్విరాన్‌మెంట్'ను యూనివర్సిటీ ప్రతినిధులకు అందజేయడం ద్వారా పీహెచ్‌డీ లభించింది. ఈసందర్భంగా సారథికి డీఈఓ సుబ్బారావు, ఎంఈఓలు పుష్పలత, వీరాస్వామి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వోద్యోగ సాధనకు గ్రంథాలయం తోడ్పాటు



తిరువూరు: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో తిరువూరు శాఖా గ్రంథాలయం నుంచి 22 మంది ఉద్యోగాలు సాధించారని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. తమ గ్రంథాలయానికి దాతలు వితరణ ఇచ్చిన విలువైన పుస్తకాలతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసిన పోటీ పరీక్షల పుస్తకాలు, వార్తా పత్రికలు, గ్రంథాలు, మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులు గత రెండేళ్లుగా నిరంతర కృషితో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారిని శనివారం గ్రంథాలయాధికారి పద్మావతి, సిబ్బంది, పాఠకులు అభినందించారు.